సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 27 । మార్చి । 2024



ఘనంగా అష్టదళ పద్మారాధన

విశాఖ కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. 8లో



వైభవంగా తిరుమంజనం

రుషికొండ శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
పాడేరు, అరకు	6.13	4.39
రంపచోడవరం	6.28	4.45

న్యూస్‌రీల్

జోలాపుట్టు స్పిల్‌వే వద్ద టెలీమెట్రీ ఏర్పాటు



జోలాపుట్టు స్పిల్‌వే జలాశయం వద్ద టెలీమెట్రీని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే జోలాపుట్టు జలాశయం స్పిల్ వే వద్ద అధికారులు టెలీమెట్రీ సెన్సార్ ఆటోమేటిక్ వాటర్ లెవెల్ ట్రాన్స్‌మిషన్‌ను ఏర్పాటుచేస్తున్నారు. దీని వల్ల జలాశయంలో నీటి స్థాయిని ప్రతి 30 నిమిషాలకు ఆటోమెటిక్ సెన్సార్ తెలియజేస్తుందని ప్రాజెక్ట్ అధికారవర్గాలు తెలిపాయి. దీనివల్ల జలాశయ సిబ్బందితోపాటు భువనేశ్వర్‌లోని ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు కూడా నీటి నిల్వలు తెలుసుకోవచ్చు. నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరినప్పుడు హెచ్చరికను టెలీమెట్రీ సూచిస్తుంది. విద్యుత్‌తోపాటు సోలార్ విధానంలో కూడా పనిచేస్తుంది.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

- ఈనెల 31 వరకు గడువు
- వచ్చే నెల 25న ప్రవేశ పరీక్ష

సాక్షి,పాడేరు: మైదాన ప్రాంతాల్లోని గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ఏపీఆర్‌జేసీ– 24 సమన్వయకర్త సంధ్యాభార్గవి తెలిపారు. భీమిలి, అచ్యుతాపురం బాలికల గురుకుల విద్యాలయాలు, నర్సీపట్నం బాలుర గురుకుల పాఠశాలలో 5,6,7,8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్లు ఉన్నాయన్నారు. అలాగే విజయనగరం జిల్లా తాటిపూడి గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అల్లూరి జిల్లాలోని బాల బాలికలు అర్హులన్నారు. ప్రస్తుతం టెన్త్ పరీక్షలు రాస్తున్న వారంతా httpr://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అన్ని తరగతులకు సంబంధించి ఏప్రిల్ 25వతేదీన పాడేరులో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.

రెండు నాటు తుపాకీలు అప్పగింత



గిరిజనులు అప్పగించిన నాటు తుపాకీలను చూపిస్తున్న ఎస్‌ఐ మనోజ్‌కుమార్

పెదబయలు: గిరిజనులు రెండు నాటు తుపాకులను స్వచ్ఛందంగా తీసుకువచ్చి అప్పగించారని ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని గలగండ పంచాయతీ మంగబంద గ్రామానికి చెందిన కొర్రా మాధవరావు, మర్రి గోపాలరావు రెండు నాటు తుపాకులను స్వచ్ఛందంగా అందజేశారని అన్నారు. మండలంలో ఇంకా ఎవరి దగ్గరైనా నాటు తుపాకులు ఉంటే వాటిని స్వచ్ఛందంగా అప్పగించాలని కోరారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇప్పటి వరకు ఐదు నాటు తుపాకులను అప్పగించారని ఆయన పేర్కొన్నారు.

మొరాయించిన బస్సులు

- ధారకొండ ఘాట్‌లో ప్రయాణికుల అవస్థలు



ధారకొండ ఘాట్‌రోడ్డులో ఆగిపోయిన బస్సు



ఘాట్ రోడ్డులో నిలిచిపోయిన బస్సు

గూడెంకొత్తవీధి: ధారకొండ ఘాట్‌రోడ్డులో మంగళవారం రెండు ఆర్టీసీ బస్సులు మరమ్మతులకు గురై నిలిచిపోయాయి. దీంతో సీలేరు వెళ్లాల్సిన ప్రయాణికులతోపాటు చింతపల్లి, గూడెంకొత్తవీధి నుంచి ధారకొండ, సీలేరు వెళ్లాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. కండీషన్‌లో లేని బస్సులను తిప్పడం వల్ల ఈ పరిస్థితి తరచూ నెలకొంటోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మన్యంలో త్రినేత్రం

- ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు
- 740 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- 281 కేంద్రాల్లో ఆఫ్‌లైన్ వ్యవస్థ
- వ్యూహాత్మకంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు



సమస్యాత్మక ప్రాంతంగా ఎన్నికల కమిషన్ గుర్తించిన చీకుపనస పోలింగ్ కేంద్రం

సాక్షి, పాడేరు: సార్వత్రిక ఎన్నికల వేళ జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గత ఎన్నికల అనుభవాల దృష్ట్యా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ప్రధానంగా మారుమూల ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించింది. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక వ్యవస్థను వినియోగించుకుంటూ.. పోలీసుశాఖను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆఫ్‌లైన్ విధానంలో..

నెట్ వర్క్ వ్యవస్థ అందుబాటులో లేని 281 పోలింగ్ కేంద్రాల్లో ఆఫ్‌లైన్ విధానంలో కెమెరాల వ్యవస్థను అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు ఇలా..

జిల్లా కేంద్రమైన పాడేరు మండలంలో సమస్యాత్మకం 30, అత్యంత సమస్యాత్మకం ఐదింటిని గుర్తించిన అధికారులు 35 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జి.మాడుగుల మండలంలో సమస్యాత్మకం 27, అత్యంత సమస్యాత్మకం 25 కాగా ఏడు కేంద్రాలు మావోయిస్టు ప్రభావితంగా గుర్తించిన అధికారులు 19 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. చింతపల్లి మండలంలో పది సమస్యాత్మకం, 28 అత్యంత సమస్యాత్మకం కాగా 14 మావోయిస్టు ప్రభావిత కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. 52 చోట్ల వెబ్ కాస్టింగ్‌కు చర్యలు తీసుకుంటున్నారు. గూడెంకొత్తవీధి మండలంలో 23 సమస్యాత్మకం, ఏడు అత్యంత సమస్యాత్మకం, 26 కేంద్రాలు మావోయిస్టు ప్రభావితంగా గుర్తించిన అధికారులు 56 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. కొయ్యూరు మండలంలో 29 సమస్యాత్మకం, 16 అత్యంత సమస్యాత్మకం, 11 మావోయిస్టు ప్రభావితం, వెబ్ కాస్టింగ్‌కు 56 కేంద్రాలను నిర్ధారించారు.

- ముంచంగిపుట్టులో మావోయిస్టు ప్రభావితం ఉన్న 50 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేస్తున్నారు. హుకుంపేట మండలంలో 13 సమస్యాత్మకం, 11 అత్యంత సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. రెండు కేంద్రాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు కాగా 26 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేస్తున్నారు. అరకులుఓయ మండడంలో 10 సమస్యాత్మక, 18 అత్యంత సమస్యాత్మక కేంద్రాలు ఉండగా 28 మావోయిస్టు ప్రభావిత కేంద్రాలుగా గుర్తించారు. అనంతగిరి మండలంలో సమస్యాత్మక 12, అత్యంత సమస్యాత్మక 8 కేంద్రాలు కాగా మావోయిస్టు ప్రభావిత కేంద్రాలుగా మూడింటిని గుర్తించిన అధికారులు 23 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేస్తున్నారు. పెదబయలు మండలంలో 27 సమస్యాత్మకం, 14 అత్యంత సమస్యాత్మక కేంద్రాలు కాగా ఆరింటిని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన అధికారులు వెబ్‌కాస్టింగ్‌కు 47 కేంద్రాలను గుర్తించారు. డుంబ్రిగుడ మండలంలో సమస్యాత్మకం 8, అత్యంత సమస్యాత్మకం 17, మావోయిస్టు ప్రభావిత కేంద్రాలు 14 కాగా 52 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు.



పెదబయలు మండలంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఇంజరి పోలింగ్ కేంద్రం

రంపచోడవరం డివిజన్‌లో..

రంపచోడవరం మండలంలో సమస్యాత్మకం 8, ఏడు మావోయిస్టు ప్రభావిత కేంద్రాలు కాగా 15 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేస్తున్నారు. దేవీపట్నం మండలంలో ఆరు సమస్యాత్మకం, నాలుగు అత్యంత సమస్యాత్మకం, 2 మావోయిస్టు ప్రభావితం కాగ 12 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. మారేడుమిల్లి మండలంలో తొమ్మిది సమస్యాత్మకం, నాలుగు అత్యంత సమస్యాత్మకం, 12 మావోయిస్టు ప్రభావిత కేంద్రాలుగా అధికారులు ఎన్నికల కమిషన్‌కు నివేదించారు. 25 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. అడ్డతీగల మండలంలో 22 సమస్యాత్మక కేంద్రాలు కాగా తొమ్మిది మావోయిస్టు ప్రభావిత కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. 31 చోట్ల వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేస్తున్నారు. వై.రామవరం మండలంలో ఐదు సమస్యాత్మకం కాగా 23 మావోయిస్టు ప్రభావిత కేంద్రాలు గుర్తించిన అధికారులు వెబ్ కాస్టింగ్‌కు 28 కేంద్రాలను గుర్తించారు. గంగవరం మండలంలో 9 సమస్యాత్మకం, 20 అత్యంత సమస్యాత్మకం, రెండు మావోయిస్టు ప్రభావితం కాగా 31 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు కానుంది. రాజవొమ్మంగి మండలంలో 9 సమస్యాత్మకం, 13 అత్యంత సమస్యాత్మకం, 8 మావోయిస్టు ప్రభావిత కేంద్రాలు కాగా వెబ్ కాస్టింగ్ 30 కేంద్రాల్లో ఏర్పాటు కానుంది.

- చింతూరు మండలంలో ఆరు అత్యంత సమస్యాత్మకం, 28 మావోయిస్టు ప్రభావిత కేంద్రాలు కాగా 34 చోట్ల వెబ్ కాస్టింగ్‌కు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎటపాక మండలంలో 16 సమస్యాత్మకం, 15 అత్యంత సమస్యాత్మకం, ఆరు మావోయిస్టు ప్రభావితం కాగా 37 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. కూనవరం మండలంలో 9 సమస్యాత్మకం, 8 అత్యంత సమస్యాత్మకం కాగా 17 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీఆర్‌పురం మండలంలో 9 సమస్యాత్మకం కాగా తొమ్మిది కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేస్తున్నట్టు ఎన్నికల అధికారవర్గాలు తెలిపాయి.

ప్రతికూల పరిస్థితులు నివేదించాం



సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించే లక్ష్యంతో ఉన్నాం. పూర్తిగా గిరిజన ప్రాంతం కావడంతో ఇక్కడ ప్రతికూల పరిస్థితులను ఎన్నికల కమిషన్‌కు నివేదించాం. సెల్ సంకేతాలు ఉన్న చోట వెబ్‌కాస్టింగ్ వ్యవస్థ అందుబాటులో ఉంటుంది. లేనిచోట ఆఫ్‌లైన్ కెమెరా వ్యవస్థ ద్వారా పోలింగ్ ప్రక్రియ నమోదవుతుంది.

– ఎం.విజయసునీత, కలెక్టర్, పాడేరు

1021 కేంద్రాల్లో 740..

జిల్లాలోని పాడేరు, రంపచోడవరం,అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1021 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 740 కేంద్రాలకు సెల్ నెట్‌వర్క్ వ్యవస్థ అందుబాటులో ఉన్నందున వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో సమస్యాత్మకం 281, అత్యంత సమస్యాత్మకం 211, మావోయిస్టు ప్రభావితం 248 కేంద్రాలు ఉన్నట్టుగా అధికారులు గుర్తించారు. పోలింగ్ తేదీకి ఒకరోజు ముందే మే 12న వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. పోలింగ్ ప్రారంభం నుంచి ఈవీఎంలు తరలించే వరకు ప్రతీ అంశాన్ని ఎన్నికల కమిషన్‌తోపాటు జిల్లాలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ పర్యవేక్షిస్తుంది.

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి అభిషేక్

అరకులోయ టౌన్: రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ర్యాలీలు, సభలు, ఇంటింటి ప్రచారం, సమావేశాలకు అనుమతి తప్పనిసరి అని అరకులోయ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి అభిషేక్ సూచించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ర్యాలీలు. సభలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా సింగిల్ విండో అప్రూవల్ సిస్టం ద్వారా అనుమతి ఇచ్చేందుకు ఏర్పాటు చేసిందన్నారు. ఎవరైనా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించే సమయానికి 24 గంటల ముందు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సోమేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ప్రచారం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఏఎస్పీ జగదీష్ అడహళ్ల

రంపచోడవరం: ఎన్నిక కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయకులు నిబంధనలకు లోబడి ప్రచారాలు నిర్వహించుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏఎస్పీ జగదీష్ అడహళ్లితో కలిసి ఏడు మండలాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నిమిత్తం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రచారం, సభలు, ఇతర కార్యక్రమాల నిమిత్తం తప్పనిసరిగా అనుమతులు పొందాలని సూచించారు. పాటించాల్సిన విధి విధానాలను తెలియజేస్తామన్నారు.

వీటికి 'కోడ్' వర్తించదా?



పాడేరులో టీడీపీ నేత రిసార్ట్స్ వద్ద తొలగించని ఆ పార్టీ ఫ్లెక్సీలు, జెండాలు

పాడేరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి పదిరోజులు అవుతున్నా పాడేరు పట్టణంలో ఓ టీడీపీ నేత రిసార్ట్స్ వద్ద ఆ పార్టీకి చెందిన ఫ్లెక్సీలు, జెండాలు, నేమ్ బోర్డులు తొలగించలేదు. వైఎస్సార్‌సీపీకి చెందిన జెండాలు, నేతల ఫ్లెక్సీలను హడావుడిగా తొలగించిన అధికారులు వీటిని పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

'కూటమి'లో నైరాశ్యం

- పాడేరు అసెంబ్లీ టికెట్ కేటాయింపులో కానరాని స్పష్టత
- టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణుల్లో నిరుత్సాహం
- కొనసాగుతున్న అయోమయం
- దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థిని ఇప్పటికీ ప్రకటించకపోవడంతో ఆపార్టీల శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. అధికార వైఎస్సార్‌సీపీ పార్టీ అందరికంటే ముందుగా పార్టీ అభ్యర్థిని ప్రకటించి ప్రత్యర్థులకు దీటైన సవాల్ విసిరింది. కానీ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు టికెట్ విషయంలో ఇప్పటికీ పూర్తిస్థాయిలో తేల్చుకోలేకపోతున్నాయి.

20 ఏళ్లలో విజయానికి దూరంగా టీడీపీ

పొత్తుల్లో భాగంగా ఈసారి పాడేరు అసెంబ్లీ టికెట్ బీజేపీకి కేటాయిస్తున్నట్లు కూటమి పార్టీలు ఒప్పందం చేసుకున్నట్లు నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రచారం సాగుతోంది. కానీ ఏ పార్టీకి పాడేరు అసెంబ్లీ టికెట్ కేటాయిస్తున్నారు అనేది ఇప్పటికి స్పష్టంగా ప్రకటించకపోవడంతో ఆ పార్టీల శ్రేణులు అయోమయంలో ఉన్నాయి. టీడీపీ ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకున్న ప్రతీ ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీ స్థానాన్ని మిత్రపక్షానికి కేటాయించడం అనవాయితీగా వస్తోంది. గత 20 ఏళ్లలో రెండుసార్లు మిత్రపక్షానికి టికెట్ కేటాయించారు. మరో రెండు సార్లు టీడీపీ ఒంటరిగా పోటీ చేసింది. అయితే గత 20 ఏళ్లలో కూడా టీడీపీ, తన మిత్ర పక్షం ఎమ్మెల్యే సీటును మాత్రం గెలుచుకోలేకపోయింది. ఈసారి ఎన్నికల్లో కూడా ఇదే రిపీట్ అవుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

టీడీపీ శ్రేణులను పట్టించుకోని చంద్రబాబు

పొత్తుల్లో భాగంగా ఈసారి బీజేపీ పాడేరు అసెంబ్లీ స్థానం కేటాయింపు దాదాపుగా ఖరారైందని.. కాకపోతే అభ్యర్థి ఎవరనే అంశం ఇంకా తేలలేదని బీజేపీ క్యాడర్ చెబుతూ వస్తున్నారు. దీంతో పాడేరు అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న టీడీపీ ఆశావాహులు అమరావతిలో సుమారు ఐదు రోజులు మకాం వేసి అధినేత చంద్రబాబు అపాయ్‌మెంట్ కోసం నిరీక్షించారు. కానీ వారికి ఆయన దర్శన భాగ్యం దక్కకపోవడంతో నిరాశతో పాడేరు వచ్చేశారు. టీడీపీకి టికెట్ వస్తుందనే ఆశను దాదాపుగా ఆ పార్టీ శ్రేణులు ఆశలు వదులుకున్నారు.

జాడలేని జనసేన

జనసేనా పార్టీ అయితే నియోజకవర్గంలో జాడ లేకుండా పోయింది. బీజేపీలో కూడా అభ్యర్థి ఎవరనేది ఇంకా స్పష్టత రాలేదు. బీజేపీలో ప్రధానంగా ఆ పార్టీ ఆవిర్భావం నుంచి ఏజెన్సీలో నమ్ముకుని ఉన్న కురుసా కుటుంబం నుంచి బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు కురుసా ఉమామహేశ్వరరావు, సోదరి జీసీసీ రిటైర్డ్ డీఎం కురుసా పార్వతమ్మ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కూడా కృష్ణారావు పోటీ పడుతున్నారు. బీజేపీ అరకు ఎంపీ అభ్యర్థిని ప్రకటించినప్పటికీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థిని మాత్రం ఇంకా ప్రకటించలేదు.

విశ్వేశ్వరరాజు విస్తృత ప్రచారం

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాత్రం ఆది నుంచి గిరిజన గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గిరిజనులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుంటూ దూసుకుపోతున్నారు. ఇప్పటికీ అభ్యర్థి పేరు ప్రకటించకపోవడంతో కూటమి పార్టీలు నిరుత్సాహపడ్డాయి.



చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ వట్టిబూసులు గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు

న్యాయవాదుల డ్రెస్ కోడ్ మార్పు

విశాఖ లీగల్: వేసవి దృష్ట్యా న్యాయవాదులు డ్రెస్ కోడ్‌ను మార్పు చేస్తున్నట్టు రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత తెలిపారు. న్యాయవాదులు కేవలం బేండ్స్ ధరించి న్యాయస్థానాలకు హాజరు కావచ్చని, ఈ వెసులుబాటు వచ్చే జూలై 15వ తేదీ వరకు ఉంటుందని ఓ ప్రకటనలో తెలిపారు.

28న బార్క్ డైరెక్టర్ రాక

మహారాణిపేట: బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్(బార్క్) డైరెక్టర్ వివేక్ బాసిన్ ఈ నెల 28న విశాఖ వస్తున్నారు. ముంబయి నుంచి విమానంలో గురువారం సాయంత్రం 4.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద ఉన్న విశాఖ సదన్‌లో ఆయన బస చేస్తారు. 29న అధికారిక పర్యటనలో పాల్గొంటారు. 29న సాయంత్రం 4 గంటలకు విమానంలో బయలుదేరి ముంబయి వెళతారు.

పుట్టెడు దుఃఖంతో పరీక్ష రాసిన విద్యార్థి

- తండ్రి మరణ వార్తను దిగమింగుకుని హాజరు
- చిన్న వయసులో పెద్ద కష్టం



పరీక్ష రాసిన అనంతరం ఇంటికి బయలుదేరిన చరణ్



తండ్రి భౌతికకాయం వద్ద అన్నతో చరణ్

రాజవొమ్మంగి: పుట్టెడు దుఃఖంతో ఓ విద్యార్థి టెన్త్ పరీక్ష రాసిన ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన తరసిక బాలరాజు సోమవారం జీడిమామిడితోటలోకి వెళ్లాడు. అతను ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి చూసేసరికి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అక్కడి నుంచి అతనిని ఇంటికి తీసుకువచ్చారు. ఈయనకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు హర్షవర్ధన్ తండ్రికి సపర్యలు చేస్తుండగా చిన్న కుమారుడు చరణ్ మంగళవారం రాజవొమ్మంగి జెడ్పీ హైస్కూల్లో టెన్త్ పరీక్ష రాసేందుకు వెళ్లాడు. ఉదయం 10గంటల సమయంలో పరిస్థితి విషమించడంతో తండ్రి బాలరాజు మృతి చెందాడు. ఈ విషయాన్ని పరీక్ష రాస్తున్న చరణ్‌కు ఉపాధ్యాయుల ద్వారా కుటుంబ సభ్యులు తెలియజేశారు. పిడుగులాంటి తండ్రి మరణ వార్తను తెలుసుకున్న చరణ్ దుఃఖాన్ని దిగమింగుకుని పరీక్ష రాశాడు. అనంతరం పరీక్ష కేంద్రం నుంచి వచ్చి అన్న హర్షవర్ధన్‌తో కలసి తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. తల్లి సుగుణ కువైట్‌లో చిన్న ఉద్యోగం చేస్తోంది. ఇలా ఆమె కూడా అందుబాటులో లేకపోవడం.. తండ్రి దూరమవడంతో అన్నదమ్ములిద్దరు అల్లాడిపోయారు. స్థానికులు వారికి ధైర్యం చెప్పారు.

ఎంపీగా విజయం సాధించి సేవ చేస్తా

- అవకాశం కల్పించిన సీఎంకు రుణపడి ఉంటా
- వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ అభ్యర్థి గుమ్మా తనూజరాణి
- రాజేంద్రపాలెంలో పార్టీ శ్రేణులతో సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు శ్రీకాంత్ రాజు



అరకు ఎంపీ మాధవితో పార్టీ అభ్యర్థులు, ఎన్నికల పరిశీలకులు, జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

కొయ్యూరు: వైద్యురాలిగా కొంతమందికి మాత్రమే సేవచేస్తున్న తనకు అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో లక్షలాది మందికి సేవలు అందించేందుకు వీలుగా పార్టీ టికెట్ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజరాణి పేర్కొన్నారు. మండలంలోని రాజేంద్రపాలెంలో మంగళవారం పార్టీ పరిశీలకులు శ్రీకాంత్ రాజు, పీలా వెంకటలక్ష్మి అధ్యక్షతన శ్రేణులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో 142 కోట్ల జనాభా ఉంటే వారిలో 543 మందికి మాత్రమే పార్లమెంట్‌లో అడుగుపెట్టే అవకాశం ఉంటుందన్నారు. జగనన్న కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పార్లమెంట్‌లో అరకు ప్రాంత సమస్యలపై గళం వినిపిస్తామన్నారు. గిరిజనుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. అరకు వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని, ఈ సారి కూడా విజయంతో హాట్రిక్ సాధిస్తామన్నారు. పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలన్న ఏకైక లక్ష్యంతో పార్టీలోకి వచ్చామన్నారు. తనకు పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన సీఎంకు రుణపడి ఉటామని చెప్పారు. తమ విజయానికి పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని కోరారు.

క్లస్టర్లుగా విభజన..

వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు కె.శ్రీకాంత్‌రాజు మాట్లాడుతూ అరకు అంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక అభిమానం ఉందన్నారు. ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా కొయ్యూరు మండలంలోని 33 పంచాయతీలను తొమ్మిది క్లస్టర్లుగా విభజించామన్నారు. ఒకొక్క క్లస్టర్‌కు నియమించే ఇన్‌చార్జి బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లతో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ తెలియజేస్తామన్నారు. మరో పరిశీలకురాలు పీలా వెంకటలక్ష్మి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసేందుకు మనమంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. దీనిలో భాగంగా అరకు ఎంపీ, పాడేరు అసెంబ్లీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, కార్యదర్శి గోవర్ధన్‌గిరి, ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు, అప్పన వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షులు జల్లి బాబులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, జేసీఎస్ కన్వీనర్ బండి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, జిల్లా గ్రీవెన్స్ సెల్ నేత గొడ్డేటి మహేష్, ట్రైకార్ డైరెక్టర్ సరస్వతి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి, సుమర్ల సూరిబాబు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రేగటి ముసిలినాయుడు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అరకు ఎంపీ మాధవితో భేటీ

అరకు ఎంపీ మాధవితో పార్లమెంట్ అభ్యర్థి తనూజరాణి, అసెంబ్లీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పరిశీలకులు శ్రీకాంత్ రాజు, వెంకటలక్ష్మి మంగళవారం శరభన్నపాలెంలో భేటీ అయ్యారు. పార్టీకి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. తమ విజయానికి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని అభ్యర్థులు కోరారు. అనంతరం ఆమెను సత్కరించారు. ఎంపీ కుమార్తెను వారు ఎత్తుకుని ముద్దాడారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేయాలి

- వైఎస్సార్‌సీపీ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి, వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంను చేయాలని వైఎస్సార్‌సీపీ అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం కోరారు. మండలంలోని మాడగడ పంచాయతీ ఎం.హట్టగుడ, దళపతిగుడ, డింగ్రిపుట్, నందిగుడ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే, మనందరి ప్రభుత్వం రావాలని అందుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనకు, ఎంపీ అభ్యర్థి తనూజారాణికి అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీలు సమర్డి శత్రుఘ్న, స్వాభి రాంచందూర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గెడ్డం నరసింగరావు, పార్టీ ముఖ్య నాయకులు శెట్టి అప్పాలు, స్వాభి రాంమూర్తి, గరం పూర్ణ, కిల్లో నొబో, శెట్టి వెంకటరావు, రంజపల్లి అర్జున్, ఏలేస్ పాల్గొన్నారు.

నడింపాలెం సబ్ సెంటర్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీ


సబ్‌సెంటర్ వద్ద టాస్క్ ఫోర్స్ అధికారులతో వైద్య సిబ్బంది

కొయ్యూరు: మండలంలోని నడింపాలెం సబ్ సెంటర్‌ను మంగళవారం జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశ కార్యకర్తల రికార్డులను పరిశీలించారు. ఆర్‌సీహెచ్ రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. టాస్క్ ఫోర్స్‌కు చెందిన ఎస్‌వో కైలాష్, డీపీవో సతీష్ తనిఖీలు జరిపారు. రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌ఎన్ భవానీ, హెచ్‌వీ లక్ష్మి, ఏఎన్‌ఎం చెల్లయమ్మ,హెల్త్ అసిస్టెంట్ శేఖర్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దాడి కేసు నిందితులు

ఎటపాక: వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవంలో కత్తితో దాడిచేసి విద్యార్థి మృతికి కారకులైన కేసులో నిందితులను ఎటపాక పోలీసులు పట్టుకున్నారు. సోమవారం యువకుల మధ్య జరిగిన ఘర్షణలో భద్రాచలానికి చెందిన ఆరుగురు యువకులు రామగోపాలపురం తండాకు చెందిన మృతుడు అజ్మీర సాయికుమార్, కత్తిపోట్లకు గురై చికిత్స పొందుతున్న కొరిమి సాయి, ఎస్ శ్రీనులపై దాడిచేసి పరారయ్యారు. పరారైన నిందితులను ఒక్కరోజులోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో నలుగురు భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీ, మిగిలిన ఇద్దరు జగదీష్‌కాలనీకి చెందినవారుగా ఎస్ఐ పార్థసారథి తెలిపారు. దీని వెనుకున్న కారణాలను రాబట్టి, పూర్తి వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

అగ్ర వర్ణాల పేదల 'నేస్తం'..



అన్ని వర్గాలకూ స్నేహ హస్తం

కాపులంటే చంద్రబాబుకు కరివేపాకులు. రిజర్వేషన్ల పేరిటే కాదు.. దగాకోరు హామీలతోనూ **సున్నం** పెడితే.. సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారిని అక్కున చేర్చుకున్నారు. **మాట** ఇవ్వకపోయినా కాపు నేస్తంతో స్నేహ హస్తం అందించారు. ఇతర అగ్రవర్ణ పేదలకు **సైతం** ఈబీసీ నేస్తం సాయమందించి ఆపద్బాంధవుడయ్యారు.

- మేనిఫెస్టోలో చెప్పిన మాట కంటే మిన్నగా మేలు
- కాపు నేస్తం, ఈబీసీ నేస్తం కింద ఏటా రూ.15 వేల సాయం
- 45 నుంచి 60 ఏళ్ల మహిళలు అర్హులు
- వైఎస్సార్‌సీపీ పాలనలో నాలుగు విడతల్లో రూ.60 వేల లబ్ధి
- కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు కాపు నేస్తం
- వైశ్య, కమ్మ, రెడ్డి, క్షత్రియ కులాల పేదలకు ఈబీసీ నేస్తం
- కాపు, అగ్రవర్ణ పేదలనూ దగా చేసిన టీడీపీ సర్కారు

సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల మేనిఫెస్టోలో లేకున్నా.. ఎలాంటి హామీ ఇవ్వకపోయినప్పటికీ కాపు సామాజిక వర్గానికి, అగ్రవర్ణ కులస్తులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. ఆయా సామాజిక వర్గాలకు చెందిన గ్రామీణ, పట్టణ మహిళల వికాసానికి తోడ్పాటునందించింది. కాపు కార్పొరేషన్ ద్వారా 'వైఎస్సార్ కాపు నేస్తం' కింద 45 నుంచి 60 ఏళ్లలోపు కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల మహిళలకు ఏటా రూ.15 వేల చొప్పున ఐదేళ్లలో మొత్తం రూ.75 వేల సాయాన్ని అందిస్తోంది. ఇప్పటివరకూ నాలుగు విడతల్లో రూ.60 వేల లబ్ధి చేకూర్చింది. ఇదే మొత్తాన్ని 'ఈబీసీ నేస్తం' పేరిట బ్రాహ్మణ, వైశ్య, కమ్మ, రెడ్డి కులాల్లో పేదలకు అందించింది.


వైఎస్సార్ కాపునేస్తం లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న జేసీ శివశ్రీనివాస్ (ఫైల్)

కాపు, అగ్రవర్ణ పేదలపై టీడీపీ శీతకన్ను..

గత టీడీపీ సర్కారు కాపు సామాజిక వర్గం, అగ్రవర్ణ పేదలపై శీతకన్ను వేసింది. కాపు రిజర్వేషన్ల విషయంలోనూ దగా చేసింది. సంవత్సరానికి రూ.వెయ్యి కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.ఐదు వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకుండా వంచించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కాపు కార్పొరేషన్ ద్వారా ఏడాదికి రూ.2 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొనగా, అంతకంటే మిన్నగా మేలు చేయడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో విశాఖ జిల్లాలో కాపు నేస్తం కింద 59,778 మందికి గానూ రూ. 89.66 కోట్లు, ఈబీసీ పథకం కింద 22,731 మంది లబ్ధిదారులకు రూ.34.09 కోట్లు, అనకాపల్లి జిల్లాలో 67,131 మందికిగానూ రూ.100.69 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 11,605 మందికి రూ.17.40 కోట్లు, అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లో కాపు నేస్తం కింద 3,453 మందికి రూ.5.17 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 1,232 మంది లబ్ధిదారులకు రూ.18.4 లక్షలు సాయమందించింది. కాపు నేస్తం కింద కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల లబ్ధిదారులకు డీబీటీ ద్వారా అందించింది.

ఈబీసీ నేస్తం వివరాలు

లబ్ధిదారులు	ఆర్థికసాయం (రూ. లక్షల్లో)
విశాఖ జిల్లా..	
22,731	3,409.65
అనకాపల్లి జిల్లా..	
11,605	1,740.75
అల్లూరి జిల్లా పాడేరు డివిజన్..	
1,232	184.8

కాపునేస్తం వివరాలు

విడతల వారీగా	లబ్ధిదారులు	ఆర్థిక సాయం (రూ. లక్షల్లో)
విశాఖ జిల్లా..		
ఫేజ్-1	23,784	3,567.60
ఫేజ్-2	21,177	3,176.55
ఫేజ్-3	7,169	1,075.35
ఫేజ్-4	7,648	1,147.20
మొత్తం	59,778	8,966.70
అనకాపల్లి జిల్లా..		
ఫేజ్-1	17,274	2,591.1
ఫేజ్-2	14,973	2,245.95
ఫేజ్-3	16,762	2,514.2
ఫేజ్-4	18,122	2,718.3
మొత్తం	67,131	10,069.5
అల్లూరి జిల్లా పాడేరు డివిజన్...		
ఫేజ్-1	168	25.2
ఫేజ్-2	166	24.9
ఫేజ్-3	1,609	241.35
ఫేజ్-4	1,510	226.5
మొత్తం	3,453	517.95

అవసరానికి ఆదుకున్న కాపు నేస్తం



నా పేరు పులఖండం లక్ష్మి. మాది రావికమతం మండలం పి.పొన్నవోలు గ్రామం. వైఎస్సార్ కాపు నేస్తం డబ్బులు నాకు ఏటా అందుతున్నాయి. ముఖ్యమంత్రిగా జగన్‌బాబు అందరికీ అన్నీ ఇస్తున్నాడు. కాపులకు కూడా ఆర్థిక సాయం ఇస్తారనడంతో మా అబ్బాయి నాకు చెప్పాడు. నిజంగా ఇస్తారా? అనే అనుమానంతో దరఖాస్తు పెట్టుకున్నాం. నాతోపాటు మా ఊర్లో మళ్ల సత్యవతి, ఆది దేముడమ్మ, పులఖండం వరహాలు, సరస్వతి, చినతల్లి, మళ్ల వరలక్ష్మి తదితర 17 మందిమి దరఖాస్తు చేశాం. మా అందరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాలో వేస్తున్నారు. దీంతో జగన్‌బాబు చెప్పాడంటే చేస్తాడని నమ్మకం కుదిరింది. తొలిసారిచ్చిన డబ్బులతోనే నా మనవడికి పేరు పెట్టినపుడు బంగారం గొలుసు కొనిచ్చి, మురిసిపోయాను. నాకు ప్రతి నెలా ఒకటో తేదీనే వృద్ధాప్య పింఛన్ ఇంటికే వచ్చి వలంటీర్ ఇస్తున్నారు. రూ.20 వేలు డ్వాక్రా రుణ మాఫీ అయ్యింది. రైతు భరోసా డబ్బులూ పడుతున్నాయి. ఇలా అన్నింటి జగన్‌బాబు మమ్మల్ని బాగానే ఆదుకున్నాడు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇలా చేసింది లేదు. వ్యవసాయానికి ఎక్కడెక్కడో అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడేవాళ్లం. ఇపుడా పరిస్థితి లేదు. చాలా సంతోషంగా ఉన్నాం. జగన్ బాబుకు ఎంతగానో రుణపడిపోయాం.

సీఎం జగన్‌తోనే మా బతుకులకు భరోసా



నా పేరు ఎస్.సత్యవతి. రాంబిల్లి మండలం దిమిలి గ్రామం మాది. నా భర్త చనిపోయాడు. ముగ్గురు పిల్లలు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లిళ్లు అయిపోయాయి. మా అబ్బాయి ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మా వలంటీర్ రాము చెప్పే వరకు కాపు నేస్తం పథకం గురించి నాకేం తెలీదు. వలంటీరే కాపు నేస్తం పథకానికి దరఖాస్తు చేయించారు. ప్రభుత్వం అడిగిన అర్హతలన్నీ ఉండడంతో పథకం మంజూరైంది. ఏడాదికి రూ.15 వేలు చొప్పున మూడుసార్లు మొత్తం రూ.45 వేలు నా బ్యాంకు ఖాతాలో పడ్డాయి. నాకు వితంతు పెన్షన్ కూడా వస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచనుగా పింఛన్ డబ్బులు రూ.3 వేలు ఇంటికే వచ్చి ఇస్తున్నారు. దీనికి తోడు కాపు నేస్తం సాయం అందింది. ఈ సొమ్మును సద్వినియోగం చేసుకునేందుకు చిన్న కిరాణా దుకాణాన్ని పెట్టుకున్నాను. జగన్‌బాబు దయ వల్ల ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పనిలేదు. నా కాళ్లపై నేను నిలబడుతూనే, నా కుటుంబానికి నా వంతు ఆసరాగా నిలుస్తున్నాను. నా పెన్షన్, కాపు నేస్తం సాయంతో కిరాణా దుకాణాన్ని విజయవంతంగా నడుపుతూ రోజూ కొంత ఆదాయం పొందుతున్నారు. గతంలో ప్రభుత్వాలు కాపు మహిళలకు ప్రత్యేకంగా ఏ పథకమూ అందించిన దాఖలాలేదు. సీఎం జగన్ సాయం మరువలేనిది.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- జిల్లాలో హిల్‌టాప్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- 31లోగా బోర్ల మరమ్మతు పనులు పూర్తి
- కలెక్టర్ విజయసునీత ఆదేశాలు


ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ విజయసునీత

సాక్షి,పాడేరు: రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, బోర్ల మరమ్మతు పనులను ఈనెల 31వ తేదీ లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.విజయ సునీత అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో ఆర్ డబ్ల్యూఎస్, మండల పరిషత్, వివిధ శాఖల అధికారులతో జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారంపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని తాగునీటి వనరులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సమస్యలు ఎదురైతే వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి పనుల వల్ల రంపచోడవరం నుంచి గంగవరం రోడ్డుతో పాటు పాడేరు సమీపంలోను పైప్‌లైన్ వ్యవస్థ దెబ్బతిందని, వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. జిల్లాలో గల 98,639 చేతిపంపుల్లో 228 పనిచేయడం లేదని వాటిని కూడా ఈనెల 31లోగా వినియోగంలోకి తేవాలన్నారు. 29 తాగునీటి పథకాల్లో 16 పథకాలు మరమ్మతులకు గురయ్యాయని, వాటి పనులు కూడా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అవసరమైతే స్టాండ్ బై మోటార్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. సోలార్ పంపు సెట్ల నిర్వహణ నిరంతరం కొనసాగాలని, జిల్లా, డివిజనల్ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వాటికి మరమ్మతులు చేపట్టాలన్నారు. జిల్లాలోని హిల్‌టాప్ గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతగిరి మండలం పినకోట పంచాయతీ మారుమూల రాచకిండాం గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించినందున అక్కడ అత్యవసరంగా తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. తాగునీటి పథకాల మరమ్మతులకు ఆయా పంచాయతీల్లో ఉన్న నిధులను కూడా వెచ్చించాలని, రాజవొమ్మంగి, వై.రామవరం, అడ్డతీగల మండలాల్లో బోర్‌మెకానిక్‌లు లేనందున అద్దె ప్రాతిపదికన తీసుకుని బోర్లకు మరమ్మతు పనులు చేపట్టాల ఎంపీడీవోలను ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలా కృష్ణ, డీపీవో, డీఎల్‌పీవోలు కొండలరావు, పి.ఎస్.కుమార్, డీఎల్‌డీవో శాంతలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమేష్‌కుమార్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈలు,ఏఈఈలు పాల్గొన్నారు.

నీలగిరి తోటకు నిప్పు పెట్టిన ఆకతాయిలు


మంటలను అదుపు చేస్తున్న స్థానికులు


ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని రామాలయం సమీపంలో ఉన్న బజ్జింగి భీమన్నకు చెందిన నీలగిరి తోటలకు మంగళవారం ఉదయం గుర్తు తెలియని ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో మంటలు భారీగా చెలరేగాయి. సమీపంలో నివాసం ఉంటున్న రామలయం వాసులు మంటలను చూసి భయాందోళనకు గురయ్యారు. తోటలను అనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలకు మంటలు వ్యాపిస్తే, మరింత ప్రమాదం జరుగుతుందని భావించిన స్థానికులు విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఫోన్‌లో సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. భారీగా చెలరేగుతున్న మంటలను స్థానికులు, మహిళా పోలీసులు గంటల కొద్దీ శ్రమించి అదుపు చేశారు. ఎవరో ఆకతాయిలే ఈ పని చేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. మంటలను అదుపు చేయకపోతే సమీపంలోని కొండ ప్రాంతానికి విస్తరించి విలువైన చెట్లు, నీలగిరి తోటలు దగ్ధమై భారీ నష్టం వాటిల్లేదని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


మృతుడు సోయం సాంబయ్య(ఫైల్)

కూనవరం: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని పొట్లవాయిగూడెం సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుంది. స్థానిక ఎస్సై నాగరాజు కథనం ప్రకారం నర్సింగపేట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సోయం సాంబయ్య(48), వెంకటాయపాలేనికి చెందిన అతని స్నేహితుడు మడకం రాజు ద్విచక్ర వాహనంపై సరకుల కోసం కూనవరం వచ్చారు. తిరుగుముఖం పడుతుండగా వెనక నుంచి వచ్చిన టాటా ఏస్ ఇంట్రాఫికల్ వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపైనున్న ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. అపస్మారక స్థితిలో ఉన్న వారిని చూసి స్థానికులు 108కు సమాచారం ఇచ్చి, కోతులగుట్ట సీహెచ్‌సీకి తరలించారు. సాంబయ్య సంఘటనా స్థలిలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మృతునికి భార్య సోయం లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రాణాపాయం నుంచి తీవ్ర గాయాలతో బయటపడిన రాజుకు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

బాంబ్ స్క్వాడ్‌తో వంతెనలు,కల్వర్టుల తనిఖీ


కుజభంగి మార్గంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టు నుంచి కుజభంగి వెళ్లే మార్గంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో మంగళవారం సీఆర్‌పీఎఫ్ పోలీసులు బాంబ్ స్క్వాడ్‌తో కల్వర్టులు, వంతెనలు పరిశీలించారు. కొత్తూరు జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగులు, లగేజీలు తనిఖీలు చేశారు. అనుమానితుల వివరాలు తెలుసుకుని విడిచి పెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా తనిఖీలు ముమ్మరం చేశామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. రాత్రి వేళల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద గస్తీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వైఎస్ జగన్‌తోనే సాధ్యం


ప్రచారం చేస్తున్న రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి


లచ్చిగూడెం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి ధనలక్ష్మి

చింతూరు: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు వైఎస్ జగన్‌కే సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని రంపచోడవరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె చింతూరు మండలం లచ్చిగూడెం, సరివెల, వేకవారిగూడెం, కల్లేరు, కుయిగూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా వంటి దుర్భర పరిస్థితులున్నా గ్రామ సచివాలయం, వార్డు వలంటీరు వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఆమె తెలిపారు. పేదల ఆకలి తీర్చడమే తొలి ప్రాధాన్యతగా జగనన్న పాలన కొనసాగిందని, ఎవరూ అప్పుల బారిన పడకుండా నేరుగా వారి ఖాతాల్లోనే సొమ్ములు జమచేయడం ద్వారా ఎంతోలబ్ధి చేకూరిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నాడు, నేడు, తాగునీటి కుళాయిలు, హెల్త్‌సెంటర్లు, రైతుభరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అవినీతికి తావులేకుండా, పార్టీలు, కులాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందాయని ఆమె తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలెవరికైనా లబ్ధి జరిగిందా అని ప్రశ్నించిన ఆమె, అప్పటి ప్రభుత్వానికి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాని మధ్య తేడాని అందరూ గమనించాలన్నారు. రానున్న రోజుల్లో మారుమూల గ్రామాల్లో సైతం మరింత అభివృద్ధి జరిగేలా కృషి చేస్తానని ఆమె తెలిపారు. తుమ్మల సచివాలయం పరిధిలో గత ఐదేళ్లలో 1,300 మందికి రూ.8కోట్ల మేరు లబ్ధి చేకూర్చామని, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.1.52 కోట్లు ఖర్చు చేశామని ఆమె తెలిపారు. కల్లేరు(చింతూరు-2) సచివాలయం పరిధిలో గత ఐదేళ్లలో సంక్షేమ పథకాల నిమిత్తం 1,450 మందికి రూ.8.50 కోట్లు మంజూరు చేయగా, అభివృద్ధి పనులకు రూ.1.50 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక కూటమిగా వస్తున్న నాయకులు మళ్లీ బూటకపు హామీలతో చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మవద్దని, పేదల అభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని ధనలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీలు మేడేపల్లి సుధాకర్, యడమ అర్జున్, కో ఆప్షన్ మెంబర్ ఎండీ అక్బర్‌అలీ, పీఏసీఎస్ చైర్మన్ శ్యామల విజయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కోట్ల కృష్ణ, నాయకులు లక్ష్మారెడ్డి, రాంప్రసాద్, ప్రవీణ్, విప్లవ్‌కుమార్, సీతారామయ్య, జయరాజు, ఖాదర్‌షరీఫ్, మురళి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్(విశాఖ): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 30న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

వాల్తేర్ డివిజన్ : రూ.10వేల కోట్లు

ఆదాయార్జనలో ఆల్‌టైం రికార్డ్



తాటిచెట్లపాలెం(విశాఖ): భారతీయ రైల్వేలో వాల్తేర్ డివిజన్ ఆల్‌టైం రికార్డ్ సాధించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.10 వేల కోట్ల ఆదాయంతో రికార్డ్ సృష్టించింది. ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఐదు రోజుల ముందే ఈ రికార్డ్ సాధించడం గమనార్హం. ఈ సందర్భంగా సిబ్బంది, అధికారులను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ అభినందించారు. మార్చి 26వ తేదీ వాల్తేర్ డివిజన్ చరిత్రలో నిలిచిపోయే రోజని, ఆర్థిక సంవత్సరానికి ముందే రికార్డు సాధించడం గర్వంగా ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే సుమారు 10 శాతం అధికంగా ఆదాయం సంపాదించినట్లు ఆయన వెల్లడించారు. వినియోగదారులను ఆకర్షించే ప్రణాళికలు, సన్నిహిత సంబంధాలు, నిర్వహణ సామర్థ్యం, ప్రయాణికుల సదుపాయాలు మెరుగుపరచడం, అధికారులు, సిబ్బంది పనితీరుతో ఈ రికార్డ్ సాధ్యమైందని డీఆర్‌ఎం తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, భద్రతా కారణాలు, జరుగుతున్న అభివృద్ధి పనుల వల్ల కొంత ఆటంకం ఏర్పడినా.. అవరోధాలను ఎదుర్కొంటూ రికార్డ్ సాధించడం ఆనందంగా ఉందన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS
- B.A-5,500, B.Com-6k, B.Sc-10k, P.G.Arts-8k. yearly in Distance at PLNM Degree college ✆ 91774 08565/ 9642656449.M.B.A-16k,MCA-20k. Sem.Admns Last Date: 25/3/24. Penalty Fee: 26th-30th March. [G-801067]

ONE SITTING
- 10th, 12th, Degree (all), PG (all), BBA, BCA, MBA, MCA, B.Sc (Agri), B.Sc (Nursing), Para Medical, Diploma, B.Tech, M.Tech, B.Ed., LLB from Recg. Univ. Exams April / May. Ph : 83417 74299 [V- 796973]

Real Estate

LAND FOR SALE
- విశాఖ నుండి 65కి.మీ. హైవే రోడ్డు పైడి భీమవరం జంక్షన్‌కు 5కి.మీ. నందు 4 ఎకరాల కొబ్బరితోట, బోరు, ఫెన్సింగ్‌తో మంచి వ్యవసాయ భూమి అమ్మకమునకు కలదు. సంప్ర॥ 9688714444. [S-1192448]

PLOT FOR SALE
- విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 6 కి.మీ. దూరంలో 5 లక్షలకే ఇంటి స్థలం, 130 ప్లాట్స్, దగ్గరిలో ఇళ్ళు, బస్సులు, మార్కెట్ అన్ని కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్, డైరెక్ట్ పార్టీస్. ఫోన్ : 81217 60605 [V- 796992]

Services

GOLD LOANS
- లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11800]

Wanted
- VIPల ఇళ్ళ వద్దనే ఉండి పెద్దవారిని, వృద్ధులను చూసుకొనుటకు సర్టిఫైడ్ నర్సులు, కేర్ టేకర్స్ (M/F), ఆయాలు విజయవాడకి కావలెను. మంచి జీతం + వసతి + భోజనం. ✆ 91608 35559, 98850 25559 [B-709]

- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సాప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185003]
- Wanted Teachers for VI to X Std. All Subject Teachers . Ayyappanagar, Muralinagar, VSP-07. Ph: 70935 13411. [V-2457]
- Pharmaలో అనుభవం కలిగి B.Sc కెమిస్ట్రీ అయి 1 to 10yrs. Exp. కలిగిన సూపర్‌వైజర్స్, సీనియర్ కెమిస్ట్రీ, ప్రొడక్షన్ ఇన్‌ఛార్జ్. Sal: 20,000 to 45,000+ PF, ESI, Ph: 88859 29369. [V-786851]
- మెడికల్ షాప్ నందు పనిచేయుటకు P.M. పాలెంలో అనుభవం గల స్త్రీ, పురుషులు కావలెను. సంప్రదించండి: 98497 31046. [V-11867]
- BHARTI Airtel Ltd నందు పనిచేయుటకు Team Leaders, Sales Promoters మరియు Sales Executives (స్త్రీ/పురుషులు) కావలెను. 91210 01188, 99490 11565. [V-6441]
- సెక్యూరిటిగార్డులు కావలెను. వైజాగ్ సిటీ జగదాంబ/గాజువాక/దాబాగార్డెన్స్ & అనకాపల్లి ఏరియాలకు. జీతం: 12,000 - 14,000/- ఇతర సదుపాయాలు కలవు. సెల్: 93815 33728/ 81795 52684. [V-3040]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520,89197 39694. [M-1233955]

సినిమా వార్తల కోసం లాగ్‌ఆన్ అవ్వండి www.sakshi.com



గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం